సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



పైడిపర్రులో టెర్రర్

తణుకు మండలం పైడిపర్రులో వరుసగా జరుగుతున్న ఘటనలతో గ్రామస్తులు హడలిపోతున్నారు. ఈ నెల 17న అర్ధరాత్రి ఆరు ఇళ్లలో చోరీలకు యత్నించారు. 8లో ▸



హత్య కేసులో నిందితుల అరెస్టు

నిడమర్రు మండలం బావాయిపాలెంలో యువకుడి హత్యకేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు రోజుల్లోనే కేసును ఛేదించారు. 8లో ▸



వివాహిత ఆత్మహత్య

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముదినేపల్లి మండలం పెయ్యేరు అలేఖ్య కాలనీలో జరిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సర్టిఫికెట్ కోర్సు పరీక్ష



పరీక్షకు హాజరైన అభ్యర్థులు

భీమవరం: భీమవరంలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్) పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ స్కూలు పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 70 మందికి 52 మంది, హయ్యర్ పరీక్షకు 29 మందికి 24 మంది హాజరయ్యారు. టైలరింగ్, ఎంబ్రాడయిరీ లోయర్ పరీక్షకు 29 మందికి 21 మంది, హయ్యర్ పరీక్షకు 12 మందికి 10 మంది హాజరయ్యారు.

భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మాణం

భీమవరం: జిల్లా కేంద్రమైన భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మాణం జరుగుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. బుధవారం భీమవరంలో మాట్లాడుతూ కలెక్టరేట్ తరలిపోతుందనేది కేవలం అపోహమాత్రమేనన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం మంజూరు చేసిన ప్రత్యేక ప్యాకేజీ రూ.11,400 కోట్లు అమలు చేసేందుకు విధి విధానాలు వేగవంతం చేశామని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచన కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్‌లో సమస్యలు పరిష్కరించి 7.3 మిలియన్ల స్టీల్ ఉత్పత్తి లక్ష్యం చేరుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వీఆర్‌ఎస్ అమలు చేస్తున్నామని ఇంతవరకు 1, 613 మంది వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా 1,141 మంది అర్హులుగా గుర్తించారన్నారు. మార్చి 31 నాటికి వీఆర్‌ఎస్ స్కీం అమలు పూర్తి చేయాలని నిర్ణయించగా తొలి విడతగా దరఖాస్తు చేసుకున్న 150 మందికి మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వబోతునట్లు కేంద్రమంత్రి చెప్పారు.

ఛత్రపతి శివాజీకి నివాళులు



శివాజీ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ

భీమవరం: భీమవరం పట్టణంలో మరాఠీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. శివాజీ దేశానికే ఆదర్శమైన మహారాజని, మహిళల పట్ల అతను చూపిన గౌరవం, రాజ్య పరిపాలన దక్షత సువర్ణాధ్యాయంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో మరాఠీ సంఘం నాయకులు చంద్రశేఖర్, శ్రీవిద్య, అల్లు శ్రీనివాస్, మటపర్తి మురళీకృష్ణ, ఇళ్ల హరికృష్ణ, వనమా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

21లోగా ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పుల పంపిణీ

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 21లోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు 16 వేల ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారని, మిగిలిన వాటిని ఈ నెల 21లోగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం విజయవాడ నుంచి భూముల రీసర్వేపై సీసీఎల్‌ఏ జి.జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ మాట్లాడుతూ రీసర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించి నివేదికలు పంపాలన్నారు. రీసర్వే రెవెన్యూ శాఖలో అతి ముఖ్యమైన అంశమని.. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన పౌర సేవలు సంతృప్తి స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రీ సర్వే వేగవంతంగా, నిర్వహించి నివేదికలు సమర్పించాలని అన్నారు.

పగలు భగభగ.. రాత్రి గజగజ

- వాతావరణ మార్పులతో ప్రజలు బెంబేలు
- వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

సాక్షి, భీమవరం: వాతావరణ మార్పులు జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పగలు ఎండ మండిపోతుంటే, రాత్రిళ్లు చలి వణికిస్తోంది. మంచు ప్రభావంతో వైరల్ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు. గొంతు నొప్పి, జలుబు తదితర లక్షణాలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు శీతల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మహా శివరాత్రి తర్వాత నుంచి చలి తీవ్రత తగ్గి ఎండల తీవ్రత పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. మునుపెన్నడూ లేని విధంగా ఫిబ్రవరి ప్రారంభం నుంచే ఎండ తీవ్రత పెరిగింది. వేసవిని తలపిస్తూ సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. కొద్ది రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో 36 నుంచి 38 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండతీవ్రతకు ఉక్కపోత తోడై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మధ్యాహ్న 11 గంటల నుంచి రోడ్డుపై తిరగాలంటే భయమేస్తోంది. జిల్లాలోని వినియోగదారులతో రద్దీగా ఉండే భీమవరంలోని జువ్వలపాలెం, సండే



భీమవరం రోడ్డులో ఉదయం మంచు ప్రభావం

మార్కెట్ రోడ్డు, నరసాపురంలోని స్టీమర్ రోడ్డు, తణుకులోని వేల్పూరు రోడ్డు, పాలకొల్లులోని బస్టాండ్ సెంటర్, తాడేపల్లిగూడెంలోని పోలీస్ ఐలాండ్ సెంటర్, తాలుకా ఆఫీస్ రోడ్డు మధ్యాహ్నం అయ్యే సరికి జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. గతంలో లేని విధంగా ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో తీవ్రత ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పగటి పరిస్థితి ఇలా ఉంటే.. చీకటిపడే సరికి వాతావరణం మారిపోతోంది. పొగమంచు కమ్మేసి చలి వణికిస్తోంది. పలుచోట్ల రాత్రి సమయంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 నుంచి 18 డిగ్రీలకు తగ్గిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల సమయం వరకు కూడా మంచు ప్రభావం ఉంటుండంతో పగటిపూట వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

పొంచిఉన్న వైరల్ ఇన్ఫెక్షన్లు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో వైరల్ ఇన్ఫెక్షన్లు విజృంభించే అవకాశం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే చిన్నారుల నుంచి వృద్ధుల వరకు జలుబు, దగ్గు, గొంతునొప్పి, తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. ఆయా లక్షణాలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రోజువారి ఓపీలో సీజనల్ వ్యాధులతో వచ్చే రోగులు ఎక్కువగానే ఉంటున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

పట్టణం	గరిష్టం	కనిష్టం
భీమవరం	36	20
తణుకు	36	21
తాడేపల్లిగూడెం	37	20
పాలకొల్లు	33	19
నరసాపురం	38	20

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో ప్రస్తుతం వ్యాధుల తీవ్రత లేకున్నా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నిల్వ ఆహారం తీసుకోకూడదు. ప్రయాణించేటప్పుడు ఎండ, మంచు నుంచి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– భానునాయక్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి



జనం లేక వెలవెలబోతున్న తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ సెంటర్

ఈ జాగ్రత్తలు పాటించాలి

- మంచులో ఎక్కువగా తిరగకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో తిరగాల్సి వస్తే మంచు ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కూలింగ్ వాటర్ తాగకూడదు. బాగా కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే భుజించాలి. నిల్వ ఉన్న ఆహారం తీసుకోకూడదు.
- గొంతునొప్పి, జ్వరం, ఒంటి నొప్పులు మొదలైన లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలి.
- డ్రైనేజీల సమీపంలో నివసించే వారు దోమల బెడద లేకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): బిడ్డకి జన్మనిస్తూ ఏ తల్లి మరణించకూడదని, వారి ఆరోగ్య అవసరాలపై స్త్రీ శిశు సంక్షేమం, వైద్య శాఖల నిరంతర పర్యవేక్షణ ఎంతైనా అవసరమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో కలెక్టర్ వైద్య, ఆరోగ్యశాఖ స్త్రీ శిశు, సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీల నమోదు, టీకాలు వేయించడం, పోషకాహార లోపంతో ఎంతమంది పిల్లల ఉన్నారో గుర్తించడం, ఏ లోపాలు ఉన్నాయో పరీక్షలు నిర్వహించడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో ఇప్పటికే నాలుగు పర్యాయాలు సమీక్షించామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. పేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అప్పుల పాలు కాకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మాతృ మరణాలు, శిశు మరణాల నియంత్రణ లక్ష్యంగా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి డా.బి. భానునాయక్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, డీఐఓ డా.డి.దేవసుధాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం పేరుతో పేదలపై కుట్ర

భీమవరం: అభివృద్ధి ముసుగులో ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు పేదల ఇళ్లను తొలగించే బుల్డోజర్ రాజకీయాలను తక్షణం విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాలుష్యమంటూ ఎన్నో ఏళ్లగా కాలువలు, పంట బోదుల పక్కన నివసిస్తున్న పేదల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేయడం దారుణమన్నారు. ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు మండలం ఐ.భీమవరం నుంచి పాలకోడేరు మండలం ఏఎస్‌ఆర్ నగర్ వరకు కాలుష్యం పేరుతో పేదల ఇళ్ళను కూల్చివేసి పేదలకు నిలువ నీడలేకుండా చేస్తున్నారని గోపాలన్ ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి కోసం చేసే పనులను సమర్ధిస్తామని అయితే అభివృద్ధి పేరుతో పేదలను రోడ్లపాలు చేయాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో భూస్వాముల పక్కనే పేదల



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

ఇళ్లు ఉండడమే తొలగింపునకు అసలు కారణమన్నారు. ప్రభుత్వ పోరంబోకు భూములను భూస్వాములు, పెత్తందారులకు కట్టబెట్టడానికే పేదల ఇళ్లను కూల్చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనకు విరుద్ధంగా నియోజకవర్గంలో వేలాదిగా ఉన్న ఉప్పునీటి బోర్లు రఘురామ కృష్ణంరాజుకు కనపడడం లేదా అని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, సేశపు ఆశ్రియ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సెలవు

ఏలూరు(మెట్రో): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు పోలింగుకు ముందు రోజు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు రోజున అవసరాన్ని బట్టి సెలవులు ప్రకటించాలని రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. ఏలూరు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబడిన కార్యాలయాలు/సంస్థలకు పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు స్థానిక సెలవు ప్రకటించారన్నారు. ఓట్ల లెక్కింపునకు పెదపాడు మండలం, వట్లూరు గ్రామంలోని సర్ సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, మార్చి 3న కాలేజీలో స్థానిక సెలవు గా ప్రకటిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఉమ్మడి జిల్లా కార్గో అసిస్టెంట్ కమర్షియల్ ట్రాఫిక్ మేనేజర్ జి.లక్ష్మీప్రసన్న సుబ్బారావు అన్నారు. బుధవారం ఆయన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కార్గో పార్సిల్ సర్వీస్ ద్వారా రూ.187 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్‌లో మొదటి స్థానంలో ఉందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్గో లాజిస్టిక్స్ ద్వారా రూ.91 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 22 రీజియన్లలో పశ్చిమగోదావరి జిల్లా నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. జంగారెడ్డిగూడెం



సమావేశంలో మాట్లాడుతున్న కార్గో అసిస్టెంట్ కమర్షియల్ ట్రాఫిక్ మేనేజర్ జి.వెంకట సుబ్బారావు

పట్టణంలోనూ పరిసర ప్రాంతాలలోనూ ఆథరైజ్డ్ ప్యాకింగ్ పార్సిల్ బుకింగ్ సెంటర్‌కు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. రూ.1000 రూపాయలతో ప్యాకింగ్ పార్సిల్ బుకింగ్ కౌంటర్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు.

లంచావతార ఉద్యోగి తొలగింపు?

సాక్షి స్పందన

నిడమర్రు: 'అడిగినంత ఇస్తేనే ఆక్వా సాగు' అంటూ సాక్షిలో ఈనెల 14న వచ్చిన కథనంపై జిల్లా ఫారెస్టు అధికారులు స్పందించారు. లంచం డిమాండ్ చేసిన ఫారెస్ట్ సెక్షన్ అధికారిగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నబిగారి శ్రీనివాసబాబును విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. శ్రీనివాసబాబుపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారించిన ఏలూరు రేంజ్ ఫారెస్ట్ అధికారి విజయలక్ష్మి రైతులను విచారించారు. అనంతరం నివేదికను జిల్లా ఫారెస్టు అధికారికి సమర్పించారు. నివేదికలోని అంశాలు బహిర్గతం కాకపోయినప్పటికీ అనధికారికంగా అందిన సమాచారం మేరకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శ్రీనివాసబాబును విధులనుంచి తొలగించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఫారెస్ట్ అధికారి విజయలక్ష్మిని సంప్రదించడానికి ప్రయత్నించినా ఆమె స్పందించలేదు.

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాలని, యూనివర్సిటీల్లో రాజకీయ జోక్యం నిషేధించాలని, ప్రైవేట్ విశ్వ విద్యాలయాల రాకను వ్యతిరేకించాలని, ఢిల్లీ యూనివర్శిటీలో సస్పెన్షన్‌కు గురైన 17 మంది విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం పట్టణంలోని నన్నయ యూనివర్సిటీ సబ్ సెంటర్ వద్ద విద్యార్థులతో కలిసి ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాలని, విశ్వ విద్యాలయాలలో వీసీ నియామకాలలో రాష్ట్ర హక్కులను కాలరాసేలా



తాడేపల్లిగూడెంలో నన్నయ వర్సిటీ సబ్ సెంటర్ వద్ద ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో నిరసన

ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాజ్యాంగ విలువలను ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. ఉన్నత విద్యను పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణ చేసేందుకు చట్టాలను సవరిస్తున్నారని ధ్వజమెత్తారు. విశ్వ విద్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బి.సౌజన్య, డి.దేవి, ఎం.మానస, జ్ఞానేంద్ర, ఎ.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలక్ష్యం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సగానికి పైగా ఫిర్యాదులు పెండింగ్‌లో
- ఫిర్యాదులపై పర్యవేక్షణ కరువు
- ఏలూరు కంటే మెరుగ్గా పశ్చిమ గోదావరి
- ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1,845కు 712 ఫిర్యాదులు పెండింగ్

ఏలూరు(మెట్రో): ప్రజా సమస్యలే పరిష్కారం దిశగా ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజాసమస్యల పరిష్కార వేదిక అంటూ కూటమి సర్కారు పేరు మార్చిందే తప్ప సమస్యలను పరిష్కరించడంలో మాత్రం శ్రద్ధ చూపించడం లేదు. వేలాది ఫిర్యాదులు వస్తున్నప్పటికీ వాటి పరిష్కారంపై దృష్టి సారించకుండా కాలం గడుపుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రతీ సోమవారం సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులందరూ అప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసి సంబంధిత శాఖలకు వచ్చిన ఫిర్యాదులను బదిలీ చేస్తున్నారు. అయితే వందలాది ఫిర్యాదులు పరిష్కారా



కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం(ఫైల్)

నికి నోచుకోవడం లేదు. వచ్చిన ఫిర్యాదులే పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఫిర్యాదిదారులు మళ్లీ మళ్లీ జిల్లా కేంద్రానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు. సీఎం డాష్ బోర్డులో సైతం స్పష్టంగా ఫిర్యాదులు కనిపిస్తున్నప్పటికీ జిల్లాల సమాచారం ఎప్పటికప్పుడు నమోదవుతున్నా.. ప్రజా సమస్యల పరిష్కారంలో మాత్రం ప్రభుత్వం దృష్టి సారించడం లేదు.

ఏలూరు జిల్లాలో 35 శాతం ఫిర్యాదులు పెండింగ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1845 ఫిర్యాదులు రాగా, 712 ఫిర్యాదులు పరిష్కార దశలో ఉన్నాయి. 1125 ఫిర్యాదులను పరిష్కరించినట్లు సీఎం డాష్‌బోర్డులో అంకెలు స్పష్టం చేస్తున్నాయి. 8 ఫిర్యాదులు రీ ఓపెన్‌లో ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 1149 ఫిర్యాదులు రాగా, 335 ఫిర్యాదులు పరిష్కార దశలో ఉండగా, 805 ఫిర్యాదులు పరిష్కరించారు. 9 ఫిర్యాదులను రీ ఓపెన్ చేశారు. ఏలూరు జిల్లాతో పోల్చుకుంటే పశ్చిమగోదావరి జిల్లా ఫిర్యాదుల పరిష్కారంలో ముందు వరుసలోనే ఉంది. సుమారు 70 శాతం పైగా ఫిర్యాదులను పరిష్కరించగా, ఏలూరు జిల్లాలో 65 శాతం ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకున్నాయి. మిగిలిన సమస్యలు పరిష్కరించడంలో అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమాలకు పేర్లు మార్చడంలో చూపించిన శ్రద్ధ ఫిర్యాదులను పరిష్కరించడానికి చొరవ చూపడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా భూ సమస్యలు, రేషన్ కార్డు సమస్యలు, పెన్షన్ సమస్యలు అధికంగా వస్తున్నాయి. వీటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించడం లేదు.

గత ప్రభుత్వంలో సచివాలయాల్లోనే పరిష్కారం

గతంలో ప్రతీ వారం స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులపై నివేదికలు ప్రభుత్వం పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణం ఆదేశాలు జారీ చేసేది. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే ఫిర్యాదులు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి సచివాలయాల పరిధిలోనే చర్యలు తీసుకునేది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో ప్రతి జిల్లా సమస్యలు కనిపిస్తున్నప్పటికీ ప్రజా ఫిర్యాదులపై మాత్రం స్పందన అరకొరగా ఉంది.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ మునిసిపల్ కార్మికులు తాడేపల్లిగూడెంలో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆప్కాస్ రద్దు చేస్తారన్న వార్తల నేపథ్యంలో పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆప్కాస్ రద్దు చేసే ముందు కార్మిక సంఘాలతో చర్చించాలని, సిబ్బంది సంఖ్యను, వాహనాల సంఖ్యను పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం అందజేయాలని నినాదాలు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏరియా కార్యదర్శి మందలపర్తి హరీష్, నాయకులు తాడికొండ శ్రీనివాస్, అల్లం కుమార్‌స్వామి, కార్మికులు పాల్గొన్నారు.

పైడిపర్రులో టెర్రర్

- గ్రామంలో గాడితప్పిన లా అండ్ ఆర్డర్
- ఒకే రాత్రి 6 ఇళ్లలో చోరీకి యత్నం
- గృహాల్లోనే పేకాట శిబిరాలు
- ఇటీవల చాకుతో యువకుడిపై దాడిచేసిన పేకాట బ్యాచ్
- ఎస్సై ఆత్మహత్యతో కొరవడిన పోలీసు నిఘా



పైడిపర్రులో శాంతిభద్రతలపై ఈనెల 16న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన గ్రామపెద్దలు (ఫైల్)



ఒక ఇంటి గుమ్మం తలుపు గెడను పెకలించిన దొంగలు (ఫైల్)



రౌడీమూకల దాడిలో యువకుడి భుజానికి గాయమైన దృశ్యం (ఫైల్)

తణుకు అర్బన్: పైడిపర్రు గ్రామంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పింది. దొంగల స్వైరవిహారం.. రౌడీ మూకల బెదిరింపులు.. జూదానికి కేరాఫ్ అడ్రస్‌గా ఈ ప్రాంతం మారింది. ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలతో పైడిపర్రువాసులు హడలిపోతున్నారు. ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి సమయంలో 1 గంట నుంచి 5 గంటలలోపు పైడిపర్రు ప్రాంతంలో దొంగలు స్వైరవిహారం చేశారు. ఒక మహిళ మెడలో 3 కాసుల బంగారు గొలుసు గుంజుకుని పారిపోగా.. మరో ఇంటి ముందు పార్కింగ్ చేసిన మోటార్‌సైకిల్‌ను అపహరించారు. గణేశుల సూర్యనారాయణ, ఆరేటి సతీష్, పంగం శంకరం, యర్రంశెట్టి సుబ్రహ్మణ్యం ఇళ్లలో తలుపులు పగులగొట్టి, తాళాలు విరగ్గొట్టి, కిటికీ చువ్వలు విరిచేసి, తలుపుల గెడలు వంచేసి ఇలా విధ్వంసం సృష్టించారు. దొంగలు చేసిన శబ్దాలకు మెలకువ వచ్చి కేకలు వేయడంతో పలాయనం చిత్తగించారు. ఒక దొంగ నిక్కరుతో ఉన్నాడని, మరో దొంగ ఫ్యాంటు ధరించి ఉన్నారని బాధితులు చెబుతుండడంతో ఈ వ్యవహారంలో ఎంతమంది ఉన్నారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఈ దొంగతనాలన్నీ రూరల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జరగడం విశేషం. పైడిపర్రు ప్రాంతం మునిసిపాలిటీలో 4 వార్డులుగా కలిసి ఉన్నప్పటికీ ఆ ప్రాంతం ఇంకా గ్రామస్థాయి వాతావరణాన్నే కలిగి ఉంటుంది. 15వేల జనాభా ఉన్న ఈ పైడిపర్రులో 2500 పైగా ఇళ్లు ఉన్నాయి.

ఆందోళనలో పైడిపర్రువాసులు

ఇటీవల ఫ్లెక్సీ వివాదంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రౌడీ మూకలు చాకుతో దాడిచేసి తీవ్రంగా గాయపరచడం, అలాగే ఒక ఇంట్లో పేకాట నిర్వహించడం వంటి ఘటనలు జరిగాయి. దీంతో ఈనెల 16వ తేదీన శ్రీబాల వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గ్రామపెద్దలు సమావేశమై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఆ మరుసటి రోజే రాత్రి దొంగలు స్వైరవిహారం చేయడం విశేషం.

కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచే..

కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి పైడిపర్రులో శాంతి భద్రతలు క్షీణించాయని, నోరెత్తితే దాడిచేసే పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే క్రికెట్ బెట్టింగ్‌లు, జూదాలకుతోడు రౌడీ మూకలు పేట్రేగిపోతుండగా, యువత, చిన్న పిల్లలకు సైతం గంజాయి, మత్తు పదార్థాలను అలవాటు చేసే పరిస్థితి పైడిపర్రులో ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సరిగ్గా మూడు నెలల క్రితం పైడిపర్రు స్పార్క్ హోటల్‌లో భారీ కోతాటను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. పైడిపర్రులో పేకాటను కుటీర పరిశ్రమగా నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. గతనెల 31వ తేదీన రూరల్ పోలీస్ స్టేషన్‌లో వీఆర్‌లో ఉన్న ఎస్సై ఏజీఎస్ మూర్తి సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనతో పోలీసు యంత్రాంగం కుదేలైంది.

ప్రత్యేక బీట్‌లు నిర్వహిస్తున్నాం

ఈ ఘటనలపై రూరల్ ఎస్సై చంద్రశేఖర్‌ను సాక్షి వివరణ కోరింది. దీనిపై ఆయన మాట్లాడుతూ దొంగతనాల వ్యవహారంపై పోలీసులు బృందాలుగా విచారణ చేస్తున్నారని, అనుమానితులను గుర్తిస్తున్నామని చెప్పారు. పేకాటలపై సమాచారం ఇస్తే దాడులు నిర్వహిస్తామన్నారు. రాత్రి సమయంలో ప్రత్యేక బీట్‌లు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

బంగారు తాడు గుంజుకుపోయాడు



17వ తేదీ తెల్లవారుజాము 5 గంటల సమయంలో మొదటి అంతస్తు భవనంలో గుమ్మం శుభ్రం చేస్తుండగా అకస్మాత్తుగా ఓ వ్యక్తి వచ్చి నా మెడలోని 3 కాసుల బంగారు తాడును గుంజుకుని పారిపోయాడు. నా భర్త గత కొంతకాలంగా వేరొక మహిళతో ఉంటుండగా దొంగ వెళ్తూవెళ్తూ ఆవిడ పేరు ప్రస్తావిస్తూ ఆమె జోలికొస్తే చంపేస్తానని హెచ్చరించి పారిపోయాడు.

–దేవ లక్ష్మి నవదుర్గ

భయాందోళన సృష్టించారు



మా ఇంటి ముందు పెట్టిన మోటార్‌సైకిల్ 17వ తేదీన తెల్లవారిన తరువాత చూస్తే కనిపించలేదు. అదే రోజు రాత్రి నా బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో కూడా దొంగలు హల్‌చల్ చేశారు. గతంలో తాళం వేసి ఉన్న ఇళ్ల మాత్రమే దోచుకునే దొంగలు ఇప్పుడు ఇంట్లో మనుషులు ఉన్న ఇళ్లలోకి సైతం ప్రవేశించారు. ఇంతకు ముందెప్పుడూ ఇటువంటి భయాందోళన పరిస్థితులు లేవు.

–చల్లా పెద్దిరాజు

క్లుప్తంగా

బెస్ట్ ఫిజిక్‌మెన్ టోర్నమెంట్‌లో విద్యార్థికి రజత పతకం



ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: చీరాలలో నిర్వహించిన ఇంటర్ కాలేజీయట్ బెస్ట్ ఫిజిక్‌మెన్ టోర్నమెంట్‌లో భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి తోట షణ్ముఖశ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు చెప్పారు. ఈనెల 17న జేఎన్టీయూకే అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లో 60 కేజీల వెయిట్ విభాగంలో షణ్ముఖ శ్రీనివాస్ రజత పతకం సాధించాడన్నారు. బుధవారం విద్యార్థిని కళాశాలలో ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు తదితరులు అభినందించారు.

రైలులో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు రికవరీ చేసిన సెల్‌ఫోన్లను అందిస్తున్న దృశ్యం

భీమవరం: రైలు ప్రయాణికులు పోగొట్టుకున్న రూ.75 వేల విలువ చేసే సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు భీమవరం రైల్వే ఎస్సై పీవీటీ రమణ చెప్పారు. బుధవారం బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్సై మాట్లాడుతూ రైలులో ప్రయాణం చేసే సమయంలో ప్రయాణికులు వారి వస్తువులు, సెల్‌ఫోన్లు భద్రంగా చూసుకోవాలన్నారు.

మోటారుసైకిల్ అదుపు తప్పి..

ఏలూరు (టూటౌన్): మోటారుసైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు రూరల్ మండలంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామానికి చెందిన భలే బాలాజీ (34) బంటా మేస్త్రిగా పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం ఇతనికి వివాహం జరిగినప్పటికీ భార్యాభర్తల మధ్య ఉన్న చిన్నపాటి విభేధాలతో ఇరువురు వేరుగా ఉంటున్నారు. అయితే బాలాజీ తన సొంత గ్రామంలో కాకుండా తన అక్క ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో మాదేపల్లి గ్రామం నుంచి మంగళవారం అర్ధరాత్రి కోటేశ్వర దుర్గాపురం వైపు వెళుతున్న సమయంలో ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. ఈ ఘటనలో తలపై బలమైన గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం అతడిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అనంతరం బుధవారం సాయంత్రం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

లెక్కల మాస్టారుపై డీఈఓ విచారణ



ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల: స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడు ఎంఎస్‌వీ ముత్యాలరావు గతేడాది నవంబర్‌లో విద్యార్థులను చితకబాదిన ఘటనపై డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ బుధవారం విచారణ జరిపారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో ఒకటవ తరగతి చదివే గుండె త్రివిక్రమ్, నాల్గో తరగతి చదివే గుండె సహస్రలను గతేడాది నవంబర్ 25న లెక్కల ఉపాధ్యాయుడు ఎంఎస్‌వీ ముత్యాలరావు అకారణంగా చితకబాదిన ఘటనపై తల్లిదండ్రులు అప్పట్లో కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా జరిగిన విచారణలో విద్యార్థులను ముత్యాలరావు కొట్టాడని ఎంఈఓ నివేదికలో పేర్కొన్నా ఆయనపై డీఈఓ చర్యలు తీసుకోకుండా, బదిలీ చేయడంపై అప్పట్లో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ వెంకట లక్ష్మమ్మ, చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ అధికారి సూర్యచక్ర వేణి బుధవారం పాఠశాలలో విచారణ జరిపి గుండె ధర్మరాజు, గుండె మాణిక్యాల నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డ్ చేశారు. అలాగే ఎంఈఓ–1 డి.సుబ్బారావు, ఎంఈఓ–2 పి.వెంకట్రావుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం డీఈఓ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఇదిలా ఉంటే మొదటి నుంచి ఉపాధ్యాయుడు ముత్యాలరావును కాపాడుతూ వస్తున్న డీఈఓతో విచారణ జరిపిస్తే బాధితులకు ఏం న్యాయం జరుగుతుందని పలువురు అంటున్నారు. దీనిపై ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరుతున్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

ముదినేపల్లి రూరల్: చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెయ్యేరు అలేఖ్య కాలనీలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తూర్పుగోదావరిజిల్లా గొల్లప్రోలుకు చెందిన మమ్మిడివరపు రాంబాబు, సంతోషిణి(26) దంపతులు. వీరు ఉపాధి నిమిత్తం పెయ్యేరులో కొంతకాలంగా నివాసముంటున్నారు. రాంబాబు చేపల చెరువుపై గుమస్తాగా పనిచేస్తుంటాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా స్థానిక ప్రైవేటు స్కూల్లో చదువుకుంటున్నారు. బుధవారం ఉదయమే రాంబాబు విధుల నిమిత్తం బయటకు వెళ్లిపోగా కొద్ది సేపటికి సంతోషిణి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేళాడుతుండడం పిల్లలు గమనించి కేకలు వేశారు. స్థానికులు వచ్చి పరిశీలించి ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించారు. తహసీల్దార్ జీఎస్ సుభానీ, ఎస్సై వీరభద్రరరావు ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. సంతోషిణి బంధువు సింహాద్రి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంతోషిణి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎస్ ప్రసాద్ తెలిపారు. పెదతాడేపల్లి గ్రామానికి చెందిన పోలిశెట్టి అజయ్‌కుమార్ బాబు (27) ఈ నెల 16వ తేదీన రాత్రి తన తల్లి ఇంటి డాబాపైకి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి మెట్లపై నుంచి కిందకు పడిపోయాడు. దీంతో అతడిని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఈ నెల 17న తాడేపల్లిగూడెం ట్రినిటీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై అజయ్‌కుమార్ బాబు భార్య లావణ్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రవణ్‌కుమార్



గణపవరం సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రవణ్‌కుమార్

గణపవరం: నిడమర్రు మండలం బావాయిపాలెంలో జరిగిన యువకుడి హత్యకేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గణపవరం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ శ్రవణ్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 16వతేదీ రాత్రి బావాయిపాలెం గ్రామానికి చెందిన మజ్జి ఏసు(25) అనే వ్యక్తిని చంపివేసి చేయిసరికి కాల్వలో పడవేసినట్లు కేసు నమోదైంది. ఈహత్య కేసును ఛేదించేందుకు ఎస్పీ శివకిషోర్ ఆదేశాల మేరకు గణపవరం సీఐ ఎంవీ సుభాష్, గణపవరం, నిడమర్రు, చేబ్రోలు ఎస్సైలు మణికుమార్, వీరప్రసాద్, సూర్యభగవాన్‌ల నేతృత్వంలో పోలీసులు రంగంలోకి దిగారు. దర్యాప్తు ప్రారంభించిన మూడు రోజుల్లోనే పోలీసులు కేసును ఛేదించి, హత్యలో భాగస్వాములైన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

వివాహేతర సంబంధమే కారణం

ఈ కేసులో మొదటి ముద్దాయి పిల్లి ఏసుబాబు భార్యతో మజ్జి ఏసుకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానం ఈ హత్యకు ప్రేరణ అన్నారు. మృతుడు తరచూ ముద్దాయి భార్యతో మాట్లాడటం, సెల్‌ఫోన్ మెసేజీలు పెడుతున్నాడన్న అనుమానంతో గతంలో కులపెద్దల సమక్షంలో తగవు పెట్టినా మృతుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో అతడిని హతమార్చేందుకు పిల్లి ఏసుబాబు, అతని తండ్రి అన్నవరం, కోలమూరు గ్రామానికి చెందిన గెడ్డాడ శ్రీనివాసరావు పథకం రచించారు. ఈనెల 15వ తేదీన పిల్లి ఏసుబాబు తన భార్య ఫోన్‌లో ఆమె పెట్టినట్లుగా మజ్జి ఏసుకు ఫోన్‌లో మెసేజ్ పెట్టాడు. తాను ఉండి మండలం మహదేవపట్నంలో తన పుట్టింట్లో ఉన్నానని, రావాలని మెసేజ్ పంపాడు. ఆ మెసేజ్ చూసిన మజ్జి ఏసు మోటార్‌సైకిల్‌పై మహదేవపట్నం చేరుకుని, ఆమె ఇంటి డాబాపైకి వెళ్లాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన ముద్దాయిలు మజ్జి ఏసును పట్టుకుని దారుణంగా చావబాదారు. ఆ దెబ్బలకు తాళలేక మజ్జి ఏసు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆరా తీశారు. దీనితో మా గ్రామంలో కులపెద్దల సమక్షంలో తేల్చుకుంటామని చెప్పి మజ్జి ఏసును పిల్లి ఏసురాజు, గెద్దాడ శ్రీనివాసరావు మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని బావాయిపాలెం బయలుదేరారు. మార్గమధ్యలో బావాయిపాలెం శివారు కొత్త కోడుపుంత వద్ద ఆగారు. అప్పటికే అక్కడ కొబ్బరి గెలలుకోసే కత్తితో సిద్ధంగా ఉన్న పిల్లి ఏసుబాబు తండ్రి పిల్లి అన్నవరంతో కలిసి మజ్జి ఏసు కుడిచేతిని నరికివేశారు. చెయ్యిని కాలువలో పడేసి, బావాయిపాలెం శివారు పశువుల రేవు వద్ద మజ్జి ఏసును వదిలేసి వెళ్లిపోయారు. అధికరక్త స్రావంతో మజ్జి ఏసు కొద్దిసేపటికే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేయడంతోపాటు వారు ఉపయోగించిన కత్తిని, మూడు మోటార్ సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

వ్యసనాలకు బానిసై చోరీలు

నిందితుడి అరెస్ట్.. రూ.3.50 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని భీమవరం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం టూటౌన్‌పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య వివరాలు వెల్లడించారు. రాయలం గ్రామ పరిధిలో అడ్డాల శ్రీనివాసరావు 2013 ఆగస్టు 16వ తేదీన రూ.10 లక్షలు మోటారుసైకిల్ డిక్కీలోపెట్టి ఇంట్లోకి వెళ్లి వచ్చేలోపు నగదును ఇద్దరు వ్యక్తులు అపహరించారు. దీనిపై టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. సీఐ జి కాళీచరణ్, ఎస్సై ఇశ్రాయేల్, కానిస్టేబుళ్లు టి శరత్, ఎన్ గోపి, ఆర్ నరేంద్ర దొంగలను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడైన నెల్లూరు జిల్లా భోగోలు మండలం కప్పరాలతిప్ప గ్రామానికి చెందిన పీట్ల మహేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.3.50 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ జయసూర్య వివరించారు. నిందితుడు మహేష్ వ్యసనాలకు బానిసై నగదు కోసం దొంగతనాలు ప్రారంభించాడని, అతడిపై పలు జిల్లాల్లో 11 కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో ఒక సస్పెక్టివ్, రౌడీ షీట్ నెల్లూరు జిల్లా బిట్రగుంట పోలీస్ స్టేషన్లో నమోదైనట్లు డీఎస్పీ చెప్పారు. రాయలం వద్ద జరిగిన చోరీ కేసులో మరో నిందితుడు బెంజిమెన్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. విలేకర్ల సమావేశంలో ట్రైనీ డీఎస్పీ కె మానస, సీఐ కాళీచరణ్ పాల్గొన్నారు.

బలివేలో ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



శ్రీరామ లింగేశ్వరస్వామి

ముసునూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలోని శ్రీరామ లింగేశ్వరాలయం. పూర్వపు కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నడుమ, ప్రాచీన తూర్పు వేంగీ చాళుక్యుల రాజధాని వేంగీ పురం(నేటి పెదవేగి)కి అతి సమీపాన కృష్ణా జిల్లా, ముసునూరు మండలం బలివేలో తమ్మిలేరు ఒడ్డునే ఈ ఆలయం ఉంది. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఇక్కడ మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఏటా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. స్వామివారిని దర్శించేందుకు ఏటా రెండు లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ ప్రత్యేకాధికారిగా, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ నోడల్ అధికారిగా, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఈఓ పామర్తి సీతారామయ్య నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా గత ప్రభుత్వ హయాంలో తమ్మిలేరుపై ప్రారంభమైన చెక్‌డ్యామ్ కమ్ హైలెవెల్ బ్రిడ్జి, స్నానఘట్టాల నిర్మాణం పూర్తి కావడంతో విశాల ప్రాంగణంగా రూపుదిద్దుకుని భక్తులకు ఆహ్వానం పలుకుతోంది. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాల ఏర్పాట్లు ప్రారంభించగా, తమ్మిలేరు జలాశయం నుంచి నీటిని కూడా విడుదల చేశారు. ఇప్పటికే మిఠాయిల దుకాణాలు, వినోద సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు.

బలివే చేరాలంటే బస్సురూట్లు ఇలా

రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న బలే రామ లింగేశ్వర ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా మొత్తం నాలుగు భాగాలుగా నూజివీడు, ఏలూరు, సత్తుపల్లి ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు నడుపుతున్నారు.

- నూజివీడు నుంచి బలివే ఉత్సవ ప్రాంగణం వరకు
- ఏలూరు నుంచి వేల్పుచర్ల మీదుగా
- ఏలూరు నుంచి విజయరాయి మీదుగా
- సత్తుపల్లి, చింతలపూడిల నుంచి బలివే వరకు.

చిత్రకారుడు వెంపటాపునకు జాతీయ అవార్డులు



చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు



చిత్రకారుడు వెంపటాపు రూపొందించిన చిత్రం

తణుకు అర్బన్: ఉత్తరప్రదేశ్ బరెల్లికి చెందిన కళారత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ గ్రూప్ ఆర్ట్ ఎగ్జిబిషన్, కాంపిటీషన్‌లో తణుకుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు రెండు అవార్డులు సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీ, ఎగ్జిబిషన్‌లో వివిధ దేశాల నుంచి వచ్చిన చిత్రకారులు తమ చిత్రకళా రూపాలను ప్రదర్శించారని, ఈ పోటీలో తనకు ఒకేసారి కళా రత్నం, ఆర్టిస్ట్ ఆఫ్ ద ఇయర్ 2024 అవార్డులు దక్కడం చాలా సంతోషంగా ఉందని వెంపటాపు అన్నారు. ఈ సందర్భంగా వెంపటాపును పలువురు అభినందించారు.

విదేశాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాం

జర్మనీ దేశ ప్రతినిధి బృందం



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తున్న బృందం

ద్వారకాతిరుమల: జర్మనీ, యూరప్ దేశాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశం తమ పర్యటన ద్వారా బలపడిందని జర్మనీ దేశ ప్రతినిధి బృందం పేర్కొంది. రైతు సాధికార సంస్థ 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం' (ఏపీసీఎన్‌ఎఫ్) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జర్మన్ ప్రతినిధి బృందం ఏలూరు జిల్లాలో బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా 'ఫౌండేషన్ ఆన్ ఫ్యూచర్ ఫార్మింగ్' తరపున బృంద సభ్యులు జాస్పర్ జోర్డాన్, బెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కౌటినో, అటెలియర్ ఫుడ్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకస్ కేప్లా ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుగుంటలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. అలాగే ఏటీఎం(ఎనీ టైమ్ మనీ), ఏ గ్రేడ్ మోడల్స్‌తో పాటు, పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్), ఆర్‌డీఎస్ (రబీ డ్రై సోయింగ్) తదితర పంట పొలాలను సందర్శించి, సాగు విధానాలపై ఆరా తీశారు.

జీవితంపై విరక్తితో నిరుద్యోగి ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



పృథ్వీ చందు (ఫైల్)

ఉంగుటూరు: జీవితంపై విరక్తితో ఓ నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కంసాలిపాలెంలో ఈనెల 17న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం యర్రమిల్లిపాడుకు చెందిన దాసరి సత్యనారాయణ, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కల్లుగీత వృత్తి చేసుకునే ఈ కుటుంబం కంసాలిగుంటలో నివసిస్తోంది. సత్యనారాయణ ఇద్దరు కుమార్తెలకు వివాహాలు కాగా కుమారుడు పృథ్వీ చందు హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. తక్కెళ్లపాడులోని బంధువుల ఇంట్లో ఫంక్షన్ నిమిత్తం పృథ్వీ చందు హైదరాబాద్ నుంచి ఈనెల 11న వచ్చాడు. ఫంక్షన్ అనంతరం ఈనెల 17న ఒక కుమార్తెను గోపాలపురంలో అత్తారింటి వద్ద దింపేందుకు తల్లిదండ్రులు సత్యనారాయణ, పద్మ వెళ్లారు. అదేరోజు మధ్యాహ్నం ఏమైందో గానీ పృథ్వీ చందు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కగదిలో ఉన్న మరో సోదరి ఎంతసేపు తలుపుకొట్టినా చందు తీయకపోవడంతో చుట్టుపక్కలవారి సాయంతో తలుపులు తీసి చందుని భీమడోలులోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పృథ్వీ చందు మృతి చెందాడు. హైదరాబాదులో ఇంటర్న్‌షిప్ చేసే ఉద్యోగాన్ని వదిలేసి, మరొక కంపెనీకి ప్రయత్నం చేస్తుండగా రాకపోవడంతో విరక్తి చెంది పృథ్వీ చందు ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పృథ్వీ చందు మృతితో ఆ కుటుంబం శోకసంద్రమైంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేయగా మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



తణుకులో విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: తణుకు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో శశి జూనియర్ కళాశాల ఇంటర్మీడియేట్ విద్యార్థిని పొలరపు సాయి జ్యోతికి ఫీజు నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం రోటరీ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో విద్యార్థినికి ఈ సాయాన్ని అందజేసినట్లు మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ మండల చైర్మన్ ఆనందం మస్తానరావు, కార్యదర్శి బొల్లం కాశి, కోశాధికారి అక్కిన కాశి, కడించర్ల రాజ రాజేశ్వరరావు, ఆకుల శేషుబాబు, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పునాది అభ్యాసంతో విద్యాప్రమాణాలు పెంచాలి



జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: పాఠశాల విద్యలో పునాది అభ్యాసం ద్వారా విద్యాప్రమాణాలు పెంచాలని మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో హనుమ అంగన్వాడీలో డొమైన్స్ ప్రోగ్రామ్ ద్వారా చిన్నారులను ఎలా అభివృద్ధి చేయాలో అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కనకదుర్గ, డీఆర్పీలు పోతురాజు, రామభద్రరావు, సన్యాసిరావు, సూపర్వైజర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాలు పరిశీలన



బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో శామ్యూల్

అత్తిలి: త్వరలో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి పరీక్షా కేంద్రాలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పి ఉండాలని ఎంపీడీవో పి శామ్యూల్ అన్నారు. అత్తిలి మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేటాయించిన అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బల్లిపాడు, కొమ్మర, ఆరవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల గదుల్లో విద్యుత్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, ఫర్నీచర్ సదుపాయాలను పరిశీలించారు.

దర్శిపర్రు సబ్సెంటర్కు వీల్చైర్ అందజేత



దర్శిపర్రు పీహెచ్సీ సబ్సెంటర్కు వీల్చైర్ అందజేత

పెంటపాడు: మండలంలోని దర్శిపర్రు గ్రామానికి చెందిన బట్టు చంద్రయ్య, అన్నపూర్ణమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు బుధవారం స్థానిక పీహెచ్సీ సబ్సెంటర్కు వీల్చైర్ను, బెడ్ను అందజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, డాక్టర్ బట్టు దినేష్చంద్ర, బట్టు స్వాతి, మీరా కుమార్, గ్రామపెద్దలు ఉన్నమట్ల ఏసురత్నం, సుంకర సంతోషం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత సోమేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేరువేరుగా బుధవారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన కాపుల రాజేంద్రప్రసాద్ లక్ష రూపాయలు, తణుకుకు చెందిన కంభంపాటి సోమేశ్వరరావు లక్ష రూపాయలను ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

ఉచిత బస్సు రోడ్డెక్కేదెప్పుడో..?

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి సర్కారు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- సూపర్సిక్స్ పథకాలపై ఆశలు పెంచుకోవద్దని చూచాయగా ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని తక్షణం అమలు చేయాలని మహిళల డిమాండ్



అత్తిలి బస్స్టేషన్లో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అత్తిలి: కూటమి ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు, ప్రతినెలా మహిళలకు రూ.1500లు, యువతకు నిరుద్యోగభృతి కింద రూ. 3 వేలు అంటూ సూపర్ సిక్స్ హామీలు గుప్పించారు. అధికారం చేపట్టి సీఎం కుర్చీ ఎక్కిన చంద్రబాబు తూతూ మంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ప్రారంభించారు. త్వరలో ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి ప్రకటించగా, మరో మంత్రి రోడ్ మ్యాప్ వేద్దాం వచ్చే ఏడాది నుంచి పథకాలు అమలుపై దృష్టి సారిద్దామని చెబుతున్నారు. హామీలు చూస్తుంటే భయమేస్తుందని ఏకంగా సీఎం చంద్రబాబు నాయుడు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి, ఎన్నికల ముందు మహిళలు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణం ఇంకెప్పుడూ అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేసాయి. అయితే ఆంధ్ర ప్రదేశ్లో టీడీపీ కూడా అదే ఫార్ములాను అమలు చేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేసింది. ఉచిత బస్సు హామీని నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్య పెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు. తణుకు నియోజకవర్గంలో 3లక్షలకు పైగా జనాభా ఉన్నారు. 18 ఏళ్ల పైబడిన మహిళలు 1,25,810 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. ప్రతీ రోజు సగటున 40 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటివరకు కనీసం స్పష్టత ఇవ్వడంలేదు. తొలుత గత ఏడాది ఆగష్టు 15 నుండి అని, మళ్లీ దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్మీడియాలో హల్చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికి తోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్సిక్స్ హామీలయితే ఇచ్చాము కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూర్చింది.

హామీలను అమలు చేయాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడంలేదు. పక్క రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం అమలు చేసింది. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.

– బుడితి శ్రీలత, మహిళ, అత్తిలి

సోలార్ రూఫ్పై నేడు అవగాహన

తణుకు అర్బన్: తణుకు పట్టణ విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని విద్యుత్శాఖ తాడేపల్లిగూడెం డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. 1 కిలోవాట్కి రూ. 30వేలు, 2 కిలో వాట్లకు రూ. 60వేలు, 3 కిలో వాట్లకు రూ.78వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుందని కావున విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. అపార్టుమెంట్ వాసులు కూడా ఈ రాయితీలకు అర్హులేనని వివరించారు. ఇందుకు సంబంధించి గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వేల్పూరు రోడ్డులోని సబ్ స్టేషన్ ఆవరణలో సోలార్ రూఫ్ టాప్పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో సోలార్ వెల్డర్స్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొంటారని స్పష్టం చేశారు.

బీవీఆర్లో సినీ సంగీత విభావరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుర గాయకుడు ఘంటసాల వర్ధంతి సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో పాటకు పట్టాభిషేకం సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. సాయి చిరు, గౌరీ, కృష్ణస్వామిలు ఘంటసాల పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్రి ప్రభాకర్ బాలాజీ, కూనిరెడ్డి శ్రీనివాస్, గాంధీ, పెద్దిరాజు, కళాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

పలువురికి కారుమూరి పరామర్శలు



రేలంగిలో వైఎస్సార్సీపీ నాయకుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి



సలీంను పరామర్శిస్తున్న మాజీమంత్రి కారుమూరి, ఏలూరు పార్లమెంట్ ఇన్ఛార్జ్ సునీల్కుమార్

ఇరగవరం: మండలంలోని పలు వైఎస్సార్సీపీ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. రేలంగి గ్రామంలో ఇటీవల మృతి చెందిన పులుపు నాగరత్నం, గోటేరు గ్రామానికి చెందిన అడబాల వీరన్న, కంద్రిక గ్రామానికి చెందిన ఆకుల అనసూయమ్మ కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ నియోజక సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్, ఇండుగపల్లి బలరామకృష్ణ, గ్రామా పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, పులుపు సునీల్ ఇరగవరం మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, పులుపు శ్రీను, వడ్డే మార్కేండేయులు, చేబ్రోలు పెద్దిరాజు, మెట్ల రాజేష్ కుమార్, గుడాల శ్రీను, దొనెల మురళీ కృష్ణ, బొక్కా గోవిందా రాజు, చీలీ మెంటరాజు, పీతాని పండు తదితరులు పాల్గొన్నారు.

తణుకు అర్బన్: తణుకు 6వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సలీం తండ్రి షేక్ షానూర్ మృతికి మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్చార్జ్ కారుమూరి సునీల్కుమార్లు సంతాపం తెలిపారు. షానూర్ ఇటీవల స్వర్గస్తులైన సందర్భంగా బుధవారం సలీం నివాసానికి వెళ్లిన కారుమూరి, సునీల్కుమార్లు ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట వైఎస్సార్సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, షేక్ జిలాని తదితరులు ఉన్నారు.

యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



ఏపి నిట్లో శివాజీ జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం: భారతదేశ చరిత్రలో గొప్పయోధుడు ఛత్రపతి శివాజీ అని ఏపి నిట్లో బుధవారం జరిగిన శివాజీ జయంతి వేడుకల్లో వక్తలు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖకు చెందిన సామాజిక కార్యకర్త జనార్దన్ అన్నారు. ఓటమి ఎరుగని ధీరుడు శివాజీ అని కీర్తించారు. స్వతంత్ర భారతం కోసం శివాజీ ఊపిరి ఆగిపోయేవరకు పోరాటం చేసిన యోధుడు అన్నారు. గెరిల్లా యుద్ధాన్ని ప్రపంచానికి పరిచయంతోపాటు సువిశాల మరాఠా సామ్రాజ్యానికి నెలకొల్పిన ధీశాలి శివాజీ అన్నారు. శివాజీ భవానీ భక్తుడైనప్పటికి అన్ని మతాలను సమానంగా ఆదరిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. యువత శివాజీని ఆదర్శప్రాయంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి, రవికిరణ్శాస్త్రి, సంతోష్కుమార్, సుదర్శనదీప, అమరేంద్రరెడ్డి, రాజేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతిని పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివాజీ జీవిత విశేషాలను వెల్లడించారు. నర్సాపురం మీడియా ఇంచార్జి నరిసే సోమేశ్వరరావు, కోకన్వీనర్ రామగాని సత్యనారాయణ, మారిశెట్టి నరసింహమూర్తి, చిట్యాల రాంబాబు, యానాల సూరిబాబు, పడాల కావ్యరెడ్డి, తుమరాడ చిన్న, జి.మహాలక్ష్మీ, ఎస్వీ రంగారావు, ఆరాధ్యుల అంజి తదితరులు పాల్గొన్నారు.



శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహిళా వాకర్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ మహిళా సంఘం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కొండయ్య చెరువు వద్ద లార్డ్ ఆఫ్ లైఫ్ అనాధశ్రమంలో పిల్లలకు వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గుంటూరి రామరాజుచే బియ్యం, కూరగాయాలు, నిత్యవసర వస్తువులు, విద్యా సామగ్రి, బిస్కెట్లు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంట్ల కనకదుర్గ, ఎం.చంటమ్మ, కె.రామలక్ష్మి, టి.అరుణ కుమారి, జి.లక్ష్మి, వి.భార్గవి, వీఎస్ ప్రసాద్, కె.నరసింహమూర్తి, కె.రామ్మోహన్రావు, డి.సత్యనారాయణ. ఎం.యోహాన్, ఎ.జనార్ధనరావు, కేవీ రెడ్డి, కోపెల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేస్తున్న మహిళా వాకర్స్

ప్రాథమిక స్థాయి నుంచే హిందీ నేర్చుకోవాలి

ఆకివీడు: మాతృభాషతో పాటే హిందీ, ఇంగ్లిష్ భాషల్ని ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు నేర్పాలని హెచ్ఎం ఆర్వీ నారాయణ(విక్రమ్) చెప్పారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం హిందీ భాషోత్సవం సందర్భంగా విద్యార్థులతో హిందీ పఠనం, రాయడం, సంభాషణ, నాటకం, యాక్షన్ పద్యాలు, వ్యాకరణం, వర్ణమాల, గుణింతాలు చెప్పించారు.



విద్యార్థులకు హిందీపఠనం నేర్పుతున్న హెచ్ఎం

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ ఎ.రవీంద్ర

ఆకివీడు: అంగన్వాడీ చిన్నారులకు విజ్ఞానదాయకమైన మాటలు చెబుతూ, ఆట పాటలతో వారి మేధస్సుకు పదును పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు జ్ఞాన బోధ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవీంద్ర మాట్లాడుతూ పసిప్రాయంలోనే పౌష్టికాహారం పొందుతూ మేధస్సు, శారీరక దారుఢ్యం పెంపొందించే విధంగా అంగన్వాడీ వర్కర్లు కృషి చేయాలన్నారు. కేంద్రాల అనుసంధానంతో చిన్నారుల్లో మరింత క్షేత్రస్థాయి పరిజ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. సెకండరీ విద్యలో అభ్యాసనానికి సంబంధించిన నాణ్యతను మెరుగుపరచడంపై కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీలు ముకుందరావు, రత్నకుమారి, నాగలక్ష్మి, రాంబాబు, ఇస్మాయిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించి, వ్యాధుల నుంచి రక్షణ పొందాలని పట్టణ సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక కడకట్ల పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 31, 32 వార్డుల్లో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగాయి. వార్డులలో ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయాలన్నారు. దోమ కాటు ద్వారా వ్యాధులు ప్రబలుతాయని, మలేరియా, చికెన్ గున్యా, పైలేరియా, మెదడువాపు వ్యాధి రాకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటిలోపల, బయట నిల్వ ఉన్న నీటిలో దోమ గ్రుడ్లు పెట్టడం వల్ల లార్వాలు వృద్ధి చెందుతాయని, లార్వాలను నిర్వీర్యం చేసేందుకు సమష్టి అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి వెంకట లక్ష్మి, శానిటేషన్ కార్యాదర్శి శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రమణ, ప్రశాంతి, సుజాత, దుర్గ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డైమండ్స్ లయన్స్కు స్పెషల్ అవార్డు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ లయన్స్ సేవా యజ్ఞం స్పెషల్ అవార్డు పట్టణంలోని డైమండ్స్ క్లబ్ ఎంపికై ంది. లయన్స్ లీడర్ చిగురుపాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో విజయవాడ లయన్స్ హాల్లో బుధవారం అవార్డు ఫంక్షన్ జరిగింది. ఇంటర్నేషనల్ లీడర్ విజయ్కుమార్ అవార్డును అందజేశారు. వక్తలు మాట్లాడుతూ లయనిజంలో చేరడం, సేవ చేయడం అదృష్టమన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ సేవలను డైమండ్స్ సభ్యులు వెల్లడించారు. డైమండ్స్ లీడర్ జిల్లా జీఎంఏ న్యూక్లబ్స్ కో-ఆర్డినేటర్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ఈ అవార్డు అందుకున్నారు. గవర్నర్ కాకరాల వేణుబాబు, డాక్టర్ పంకజక్షన్, సీహెచ్ సత్యనారాయణ, దామర రంగారావు, కేవీ కిషోర్ కుమార్, వేమా కోటేశ్వరరావు, కొత్తపల్లి రవి కుమార్, ఎంవీఎస్ రాజు, ఈపూరి సత్యనారాయణ, విజయ్భాస్కర్ రెడ్డి, సుబ్బారావు, క్లబ్ సభ్యులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న పేరిచర్ల మురళీ కృష్ణంరాజు

చల్లని తల్లులు దీవించండమ్మా

- వివాహ సంప్రదాయంలో భక్తి పరవశం
- వధూవరులను చల్లంగా చూడుతల్లి

తాడేపల్లిగూడెం: లోకాలను ఏలే చల్లని తల్లులు దీవించండమ్మ. చనివిడి, వడపప్పు, పానకం స్వీకరించి దంపతులు కాబోయేవారిని ఆశీర్వదించండమ్మా. తల్లి మహంకాళమ్మ, బలుసులమ్మ, మావుళ్లమ్మ అంటూ దేవతలను భక్తి ప్రపత్తులతో పూజిస్తూ చలిమారు పోసుకోవడం వివాహ వేడుకలో ఒక తంతు. బోనంతో చల్లని వస్త్రాలను దాటుతూ నీ గద్దెకొస్తున్నాం. నూతన వధూవరులను చల్లగా చూడయ్యా వీరాస్వామి అంటూ బోనం వేసుకోవడం కూడా పెళ్లి వేడుకలో ఒక ఘట్టం. ప్రకృతిలోని రాయిలో, చెట్టులో, పుట్టలో, నీటిలో, గాలిలో పంచభూతాలలో అణువుఅణువులో భగవంతుని రూపాన్ని మననం చేసుకుంటూ పూజాదికాలు చేయడం భారతీయ, సంస్కృతి, సంప్రదాయంలో ఒక విశిష్ట ఆనవాయితీ. వివాహం అనేది జీవితంలో ముఖ్యమైన ఘట్టం. ఈ ప్రక్రియ హిందూ సంప్రదాయంలో మరింత పవిత్రమైంది. అందరూ కలిసి లక్ష్మీనారాయణ స్వరూపమైన దంపతులను ఒకటి చేయడం ఒక గొప్పవేడుక. వివాహ సంబరాలు, పెళ్లిళ్ల జోరు ఊపందుకుంది. విశ్వాసాలకు అనుగుణంగా చలిమారు. వీరాస్వామి బోనాలు వేసుకోవడం ఎక్కడ చూసినా కనిపించేదే. చలిమారు పెళ్లి తంతులో చలిమారు అంటే దేవతలకు చనివిడి పానకాలు పోసుకోవడం. కణికదప్పికలు (మాదిగ డప్పులు)తో ధవళ వస్త్రదారి అయిన వరుడు లేదా వధువు పానకం కావిడిని మోసుకుంటూ దేవతలకు చనివిడి. వడపప్పు, పానకం, కొబ్బరి, అరటి పండ్లు నైవేద్యంగా అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి సమర్పించుకోవడమే చలిమారు. సాంబ్రాణీ, గుగ్గిలపు ధూపాలను అమ్మవార్లకు వేసి వివాహ బంధాన్ని అరమరికలు లేకుండా ఆనందంగా, సంతోషంగా ఆస్వాదించేలా ఆశీర్వదించమని వేడుకుంటారు. గ్రామదేవతలుగా ఉన్న వారికి, ఇంటి ఇలవేల్పులుగా ఉన్న అమ్మవార్లకు, పోతరాజుకు బంధుమిత్రులతో వెళ్లి చలిమారు పోసుకుంటారు. అమ్మవార్ల అనుగ్రహం పొందుతామని, చల్లంగ ఉంటామని విశ్వసిస్తారు.



చలిమారు సంబరం కొన్ని చోట్ల ఇలా..

వీరస్వామి బోనం...

తెలంగాణాలో బోణాలు సంబరం ఉంటుంది. గోదావరి జిల్లాల్లో వీరాస్వామి బోనం పెళ్లి సందర్భంగా వేసుకోవడం సంప్రదాయం. వీరణాలు, తాసాలు, రామడోలు వాయిద్యాల నడుమ పెళ్లి కూతురు లేదా పెళ్లి కుమారుడు ఊరేగింపుగా బోనంతో వెళతారు. గణాచారి పేకబెత్తం బాణంలా విరిచి నడుచుకుంటూ వెళతారు. వధూవరులు, బంధువులు తడిపి పర్చుకుంటూ వేసే చల్లని వస్త్రాలపై నడుచుకుంటూ వెళుతూ మొక్కులు చెల్లించుకొని, పెళ్లి తంతుకు ఉపక్రమిస్తారు. వారసత్వంగా కొన్ని కుటుంబాలకు వీరస్వామి బోనం వేసుకోవడం ఆనవాయితీ.

చలిమారు. బోనం పెళ్లిలో ఒక సంప్రదాయం- రామం. శంకరమఠం, తాడేపల్లిగూడెం చలిమారు, వీరస్వామి బోనం వివాహ ఆచార సంప్రదాయాల్లో ఒక భాగం. గ్రామదేవతల ఆశీస్సులు పొందడానికి ఇవి చేస్తారు. అమ్మా మమ్మల్ని రక్షిస్తూ, అబ్బాయిని, అమ్మాయిని నువ్వు వచ్చి ఆశీర్వదించి వెళ్లమ్మా అంటూ పానకాలు పోస్తారు. కుటుంబాన్ని కాబోయే దంపతులను భద్రంగా చూడమని వీరస్వామి బోనాలు వేస్తారు. కన్యాదానం, మాంగల్య ధారణ, సుముహూర్తం. తలంబ్రాలు ఇలా ముఖ్య ఘట్టాలతో ఉన్న గొప్ప సనాతన ధర్మ వివాహ వ్యవస్థలో చలిమారు, బోనం కూడా అంతర్భాగమే.

వంశపారంపర్యం వీర కొలుపు బోనం

వివాహాల సందర్భంగా వీరస్వామిబోనం, వీర కొలుపు చేసుకోవడం వంశపారంపర్యంగా వస్తుంది. 1975 నుంచి మా కుటుంబాలు ఈ సంప్రదాయం పాటిస్తున్నాం. వివాహ క్రతువు సందర్భంగా ఇంటి దగ్గర పూజ చేసుకొని వీరులతో ముందుగా శివాలయానికి వెళ్లి పూజలు చేస్తాం. తర్వాత కాలువలో స్నానాలు ఆచరిస్తాం. తిరిగి ఇంటికి వచ్చి భోజనాలు ముగిసిన తర్వాత పూజాసామగ్రి ఊరేగింపుతో జమ్మిచెట్టు వద్దకు వెళ్లి వీరస్వామి గద్దె దగ్గర పూజాదికాలు చేస్తాం. తిరిగి ఇంటికి చేరుకున్నాక రాత్రి నుంచి తెల్లారేవరకు నిప్పులగుండం, శూలాల ఉత్సవం. బుక్కా చల్లడం, గరగల నృత్యంతో వీరస్వామిబోనం పూజ ముగుస్తుంది. ఇది మా విశ్వాసం. శుభం జరుగుతుంది.

– ఈతకోట తాతాజీ. చాంబర్ ఆఫ్ కామర్సు అధ్యక్షుడు , తాడేపల్లిగూడెం